
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 28 అక్టోబరు 2025



సత్ప్రవర్తన కోసమే పునరావాస ఉపాధి కేంద్రాలు

- విడుదలైన ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి
- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా




మాట్లాడుతున్న సౌమ్య మిశ్రా

మోపాల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వివిధ నేరాలపై జైళ్లకు వెళ్లి శిక్ష అనుభవించిన ఖైదీ మార్పు కోసం రాష్ట్ర వ్యాప్తంగా స్వయం ఉపాధి అందిస్తూ 31 పెట్రోల్ బంకులు జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. నిజామాబాద్ నగర శివారులోని మల్లారం ప్రాంతంలో జిల్లా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నూతన పెట్రోల్ బంకును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుసో తెలియకో నేరాలకు పాల్పడతారని అందుకు కోర్టు వారికి జైలు శిక్ష విధిస్తుందని అన్నారు. జైలు విడుదల అయిన వారికి ఉపాధి కోసం పునరావాస ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పురుషులకు పెట్రోల్ బంకులతో పాటు, మహిళా ఖైదీల కోసం కుట్టుమిషన్లు ఇతర స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసి వారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విడుదలైన ఖైదీలు సద్వినియోగపరుచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎం రిటైల్ బీపీసీఎల్ శ్రావణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పర్సన్ వెల్ఫేర్ తెలంగాణ అధికారి మురళి బాబు,

మిగతా 8వ పేజీలో...

ఖైదీల్లో మార్పు రావాలి

- జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా 8

నృసింహా దేవా.. జయహో

- లింబాద్రి కొండపైకి లక్ష్మీ నరసింహుడు
- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

భీమ్‌గల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని రామాలయం నుంచి శ్రీ లక్ష్మీ నరసింహ ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు నంబి వంశస్థులు పట్టు వస్త్రాలు, స్వర్ణ, పుష్పాలంకరణతో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం బోయిల పల్లకి, నాయి బ్రాహ్మణుల దివిటీల కాంతులు, మహిళల మంగళ హారతులు, బోనాలు, బాజా భజంత్రీలు మేళ తాళాలు, పురోహితుల వేదమంత్రాలతో భక్తుల గోవిందా జపంతో ఊరేగింపుగా లింబాద్రి గుట్టపైకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరైన మహిళలు, భక్తులు భక్తి పారవశ్యంతో ఊరేగింపులో పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రత్యేక నృత్యాలు

పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు శ్రీలక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాల ఊరేగింపులో పాల్గొని కోలాటాలతో ప్రత్యేక నృత్యాలను చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


విద్యార్థినుల కోలాటాలు

మంగళహారతులు, బోనాలతో మహిళలు


సిద్ధుల గుట్టకు కార్తీక శోభ

- మొదటి సోమవారం భక్తుల పూజలు
- సిద్ధేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు 6


టోకెన్‌ను చూపిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

లక్కీ 'డ్రా'ఫ్

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

- డ్రా తీసి దుకాణాలు కేటాయించిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- మహిళలకు 20మద్యం దుకాణాలు
- తొలి విడతగా ప్రభుత్వానికి రూ.9.84 కోట్ల ఆదాయం
- మీడియాను అనుమతించని అధికారులు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు
- కొందరు సిండికేట్‌లకు ఖేదం.. కొందరికి మోదం

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 102 మద్యం దుకాణాలకుగాను 2,786 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం లక్కీ డ్రా నిర్వహించి 102 మందికి మద్యం దుకాణాలను కేటాయించారు. నగర శివారులోని భారతీ గార్డెన్‌లో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి లక్కీ డ్రా నిర్వహించి మద్యం దుకాణాల కేటాయింపులను పూర్తిచేశారు. దరఖాస్తుల రూపంలో రూ.83..58కోట్ల ఆదాయం సమకూరింది. షాపులను దక్కించుకున్న వారి నుంచి మొదటి విడతగా ప్రభుత్వానికి రూ.9 కోట్ల84లక్షల17వేలు ఆదాయం సమకూరనుంది. దుకాణాల కేటాయింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగియడంతో ఎక్సైజ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళలకు 20 షాపులు..

మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు తమ ఇంటి మహాలక్ష్ముల పేరుమీద దరఖాస్తు చేసి తమ లక్కును పరీక్షించుకున్నారు. ఎక్కువ సంఖ్యలో మహిళల పేరుమీద మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. 102 మద్యం దుకాణాలకు గాను లక్కీ డ్రాలో 20మద్యం దుకాణాలు మహిళలను వరించాయి. ఇందులో నిజామాబాద్ స్టేషన్ పరిధిలో 6, బోధన్ స్టేషన్ పరిధిలో 3, ఆర్మూర్ స్టేషన్ పరిధిలో 6, భీమ్‌గల్ స్టేషన్ పరిధిలో 4, మోర్తాడ్ స్టేషన్ పరిధిలో 01 మద్యం దుకాణాలు మహిళలకు దక్కాయి. నవీపేట్ మండలం నాగేపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత భార్య ఉమకు రెండు మద్యం దుకాణాలు దక్కాయి

డివిజన్ వారీగా డ్రా..

నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, మోర్తాడ్ డివిజన్‌ల వారీగా లక్కీడ్రాను నిర్వహించారు. అత్యధికంగా ఏర్గట్ల మద్యం దుకాణానికి 96దరఖాస్తులు నమోదు కాగా, ఈ మద్యం దుకాణం శ్రీధర్ రెడ్డిని వరించింది. ఆలూర్ మద్యం దుకాణం నర్సాగౌడ్‌కు దక్కింది. ఈ మద్యం దుకాణాల్లో కొందరు రాజకీయ నాయకులు కూడా తమ

మిగతా 8వ పేజీలో...

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- రానున్న మూడు రోజులు భారీ వర్షాలు
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావం వల్ల రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సోమవారం సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. తుపాను ప్రభావం గురించి రైతులకు తెలియజేస్తూ, అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. కాగా, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ అమలు కోసం చేపడుతున్న కసరత్తు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, కిరణ్మయి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, బీఎల్‌వో సూపర్వైజర్లు, బీఎల్‌వోలు, రెవెన్యూ పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ 8

పోలీసు ప్రజావాణికి 11 ఫిర్యాదులు


డొంకేశ్వర్ శివారులో పసుపు పంటలో చేరిన వర్షపు నీరు

తెగుళ్ల పంజా

- అధిక వర్షాలతో పసుపు పంటకు ముప్పు
- నీరు నిలిస్తే తోటలకు చీడపీడలు
- ఆందోళన కలిగిస్తున్న మచ్చ తెగుళ్లు, దుంపకుళ్లు
- ప్రస్తుతం కొమ్ము దశలో పంట
- పంట దిగుబడిపై రైతుల ఆందోళన
- జిల్లాలో 23,611 ఎకరాల్లో సాగు

డొంకేశ్వర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పసుపు పంటను బంగారంతో పోలుస్తారు. బంగారం ధర పెరిగితే పసుపు ధర పెరుగుతుందని రైతుల నమ్మకం. అలాంటి పంటపై రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రస్తుతం అధిక వర్షాలతో పసుపు పంటకు అధిక తెగుళ్ల సోకడంతో పసుపు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటకు తేమశాతం ఎక్కువైతే పంటకు వేరుకుళ్లు, దుంపకుళ్లు, చీడపీడలు అధికంగా సోకుతోంది. జిల్లాలో 23611 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేస్తున్నారు. జూలై నుంచి నిరంతరం వర్షాలు పడుతుండటంతో పసుపు పంట దెబ్బతింటుంది. ప్రస్తుతం పసుపు కొమ్ము వేసే దశలో ఉంది. ఇటువంటి సమయంలో అధికంగా వర్షాలు కురిస్తే పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు పంటకు ఎక్కువ నీరు నిలుస్తే ఆకులపై మచ్చ


ఆకుకు తెగుళ్లు

మిగతా 8వ పేజీలో...

దుంప కుళ్లు సోకుతోంది..

: దోడ నర్సయ్య, రైతు, సిర్పూర్



వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి దీంతో పసుపు పంట దుంప కుళ్ల అధికంగా సోకింది. నాలుగు ఎకరాలు సాగు చేశాను. పసుపు సాగు చేసిన నుంచే వర్షాలు కురుస్తున్నాయి. అధిక వర్షాలతో పసుపు పంటలకు ఎదుగుదల లేకుండా పోయింది. చీడపీడలు అధికంగా సోకడంతో ఎన్ని మందులను చల్లినా ఫలితం లేదు. పెట్టుబడులు మీద పడే పరిస్థితి కనిపిస్తుంది.

జాగ్రత్తలు పాటించాలి..

: రుద్ర వినాయక్, డివిజనల్ ఉద్యాన అధికారి, బాల్కొండ.



పసుపు పంటకు వర్షాలతో దుంపకుళ్లు, దుంప ఈగ, మర్రకు తెగులు ఉధృతంగా ఉంది. పలు జాగ్రతలు తీసుకుంటే నష్టం తగ్గించవచ్చు. దుంపకుళ్లు నివారణకు మెటలెక్సిల్ + మ్యాన్కోజెబ్ మందును లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున మొక్క అడుగు భాగంలో పడేవిధంగా పిచికారీ చేయాలి. దుంప ఈగ నివారణకు.. ప్రొఫెనాఫస్ మందును లీటరు నీటికి 1మీ.లీ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

విద్యావ్యవస్థ లేనిదే భవిష్యత్తు లేదు

- రూ.కోటి విరాళం ప్రకటించిన బిగాల గణేష్, మహేష్‌కు అభినందనలు
- వారి స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు ముందుకు రావాలి
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి
- రూ. 5.70కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ప్రారంభం


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాక్లూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విలువలు అంతరించి పోతున్న వేళ సమాజ సేవకు ముందుకు వచ్చిన బిగాల గణేష్, బిగాల మహేష్‌లు తాను చదువుకున్న పాఠశాలకు రూ.కోటి విరాళం ఇచ్చి తమ ఉదార స్వభావాన్ని ప్రకటించారని వారి బాటలో మరింత మంది ముందుకు వచ్చి సామాజిక సేవ చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మాక్లూర్‌లో రూ.5కోట్ల70 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిగాల సోదరులు తాము పుట్టి పెరిగి చదువుకున్న పాఠశాలకు రూ.కోటి విరాళం ఇవ్వగా ప్రభుత్వం రూ.4కోట్ల70 లక్షలు నిధులు మంజూరు చేసి రూ.5కోట్ల70 లక్షలతో అన్ని హంగులతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిర్మించారని తెలిపారు. కోటి రూపాయలు ప్రకటించిన వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేని కారణంగా విద్యవ్యవస్థ పతనం అవుతున్న వేళ ఇలాంటి దాతలు ముందుకు రావడం

మిగతా 8వ పేజీలో...

నగరం మరింత భద్రం..

- 'నిజామాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్' ప్రారంభం
- లోగో ఆవిష్కరించిన సీపీ సాయి చైతన్య
- కొత్త భద్రతా అధ్యాయం
- పౌరులు, పోలీసులు చేతులు కలిపి నగర భద్రతకు సన్నద్ధం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీపీ సాయిచైతన్య

నిజామాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగర ప్రజల భద్రత కోసం మరో అద్భుతమైన ముందడుగు పడింది. హైదరాబాద్ మాదిరిగానే ఇప్పుడు నిజామాబాద్‌లోనూ "సిటీ సెక్యూరి టీ కౌన్సిల్" ప్రారంభమైంది. ఈ మండలిని సీపీ సాయి చైతన్య సోమవారం ఘనంగా ప్రారంభించారు. మహిళా భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ, సైబర్ భద్రత వంటి అంశాలపై కౌన్సిల్ కీలకంగా పనిచేయనుంది. నగరంలో భద్రతా చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసులు, పౌర సహకారంతో భద్రత కు కొత్త రూపు ఇవ్వడం భద్రతా మండలి లక్ష్యం.

కమిటీ సభ్యులు వీరే..

డాక్టర్ కవితారెడ్డి, కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్, ఎల్వీ షోరూం యజమాని శివప్రసాద్, కాపర్తి శ్రావణ్, నవ్య భారతి చైర్మన్ సంతోష్.

ప్రజలే భాగస్వాములు.. పోలీసులే మార్గదర్శులు

ఈ మండలి ప్రజల, ప్రైవేట్ సంస్థల, విద్యాసంస్థల, వ్యాపార సంస్థల సహకారంతో పనిచేయనుంది. ఇది ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య మోడల్‌లో ఏర్పాటు చేశారు. పౌరులు, సంస్థలు, విద్యార్థులు భద్రతా చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత వంటి అంశాల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు జరుగుతాయి. పౌర సమాజం, పోలీసులు కలిసినప్పుడు నిజమైన భద్రత సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

మహిళల భద్రతే మొదటి లక్ష్యం

మహిళా భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నామని అధికారులు తెలిపారు. విద్యార్థినులు, ఉద్యోగినులు, వ్యాపారవేత్తలు, హాస్టల్ యజమానులు ఈ మండలిలో భాగస్వాములు కానున్నారు. సాయంత్రం తర్వాత సురక్షిత మార్గాలపై మానిటరింగ్, మొబైల్ పట్రోలింగ్, సీసీ

మిగతా 8వ పేజీలో...

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజీపడొద్దు


కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎంపీ

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం రాజీపడవద్దని ఎంపీ అర్వింద్ అన్నారు. నగరంలోని బ్యాంకు కాలనీలో బాధిత కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ప్రభుత్వాలు నడిపిస్తే గన్ కల్చర్ ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. గత ఐదు, పది సంవత్సరాల్లో గన్ కల్చర్ బాగా అభివృద్ధి చెందిందన్నారు. ఇటీవల ప్రమోద్ హత్య గోరక్షక్ సోనూసింగ్‌పై కాల్పులు గన్ కల్చర్‌ను సూచిస్తాయన్నారు. అంతకముందు ప్రమోద్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రెండు లక్షల చెక్కును అందజేశారు. అనంతరం నగరంలోని రియాజ్‌చేతిలో గాయపడ్డ ఆసిఫ్‌ను పరామర్శించి అతడికి ధైర్యం చెప్పారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

క్రైం సమాచారం

ఆర్టీసీ బస్సు ఢీ.. పారిశుధ్య కార్మికురాలి మృతి



నాగమణి(ఫైల్)

బోధన్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికురాలు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. రాజం నాగమణి(40) బోధన్ మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆమె అంబేద్కర్ చౌరస్తాలోని గాంధీ పార్కు ఎదుట విధుల నిమిత్తం రోడ్లను ఊడుస్తుండగా బోధన్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న సంగారెడ్డి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఆమె ఢీకొన్నారు. ఈ ఘటనలో పారిశుధ్య కార్మికురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి. అక్కడి నుండి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు మున్సిపల్ కార్యాలయం, బోదన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వపరంగా కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకుంటామని మృతురాలి కుటుంబ సభ్యులకు డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేస్తామని, ఒకరికి ఉద్యోగ నియామకం కల్పించనున్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో కార్మిక నాయకులు శాంతించారు.

అనాథలైన పిల్లలు..

నాగమణి మృతితో ఆమె ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. నాగమణి భర్త గతంలో ఆచన్‌పల్లి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు 2005లో విద్యుత్ షాక్‌కు గురైన మృతి చెందారు. సోమవారం నాగమణి మృతి చెందడంతో ఇద్దరు కుమారులు రాజ్‌కుమార్, మహేష్ రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. రాజ్‌కుమార్ ఇంటర్మీడియట్, మహేష్ 10వ తరగతి చదువుతున్నాడని స్థానికులు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి... శవమై తేలాడు



రవి (ఫైల్)

నిజాంసాగర్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని చితకబాది 4రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు మండలకేంద్రంలోని మంజీరా నదిలో సోమవారం శవమై తేలాడు. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. బంజారాతండాకు చెందిన రాథోడ్ రవి(36) కన్నతల్లితో గొడవపడి తీవ్రంగా చితకబాదాడు. తీవ్ర గాయాలైన తల్లిని ఆసుపత్రిని చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం రాథోడ్ రవి మోటారు సైకిల్ పార్కింగ్ చేసి కనబడకుండా వెళ్లాడని, నిజాంసాగర్ ప్రాజెక్టు వీఆర్ నెంబర్ 5లోని గేటు ద్వారా మంజీరా నదిలోకి నీటిని విడుదల కొనసాగుతూ ఉండటంతో రవి నీటిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మంజీరా కిందిభాగంలో రవి మృతదేహం వెలికితీశారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాన్సువాడ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫరీద్‌పేట్‌లో మహిళపై లైంగిక దాడి

పాల్వంచ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫరిద్‌పేట్‌లో ఆదివారం సాయంత్రం మహిళపై లైంగిక దాడి ఘటన గ్రామంలో ఉద్రిత్తతకు దారితీసింది. మాచారెడ్డి ఎస్‌ఐ అనీల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిళ వ్యవసాయ బావి దగ్గర ఉండగా సమీపంలోని రైస్‌మిల్లులో కూలీ పని చేసే బిహార్ రాష్ట్రానికి చెందిన వారు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆమె తీవ్ర రక్తస్రావంతో ఉండగా.. గ్రామస్థులు గమనించి వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుంచి సఖీ కేంద్రానికి తరలించారు.

గ్రామంలో ఉద్రిక్తత..

మహిళపై లైంగిక దాడి జరిగిందని తెలుసుకున్న గ్రామస్థులు ఆదివారం రాత్రి రైస్‌మిల్లుకు వెళ్లారు. పోలీసులు వెంటనే స్పందించి బిహార్ కూలీలను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం గ్రామస్థులు రైస్‌మిల్లు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఘటనాస్థలానికి కామారెడ్డి ఏఎస్పీలు నర్సింహారెడ్డి, చైతన్యరెడ్డి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలికి న్యాయం చేస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. మాచారెడ్డి, రామారెడ్డి, బీబీపేట ఎస్‌ఐలు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

మంజీర నదిలో మృతదేహం లభ్యం

కోటగిరి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని మంజీర నదిలో సోమవారం కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైనట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుళ్లిపోయిన మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఆధారాలు సేకరించగా ఆగస్టు 31వ తేదీన కారేగాం గ్రామానికి చెందిన బుడ్డ చిన్నబోయి(64) అనే వ్యక్తి కనబడడం లేదని అతడి కూతురు ద్రుపత పోలీసులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా సంబంధిత కుటుంబ సభ్యులను సంఘటన స్థలానికి పిలిపించగా దుస్తులను గుర్తు పట్టి మృతుడు చిన్నబోయిగా గుర్తించారు. ఆగస్టు 30వ తేదీన చిన్నబోయి కాలకృత్యాలు తీర్చుకునేందుకు మంజీర నది వైపు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

యువకుడిపై పోక్సో కేసు

బీర్కూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఒక యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. సంవత్సర కాలంగా ప్రేమాయణం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా యువకుడు ఇటీవల బాలికకు మాయ మాటలు చెప్పి తనవెంట తీసుకుపోయి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిని అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. యువకుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీధి కుక్కల దాడి.. ఆరుగురికి గాయాలు

రాజంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం తండాలో సోమవారం వీధి కుక్కల దాడిలో ఆరుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని అధికారులు కుక్కల నియంత్రనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వెండి దుకాణంలో దొంగతనం

▸▸ ఆరు కిలోల వెండి, తులం బంగారం అపహరణ

నవీపేట, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైష్ణవి సిల్వర్ మర్చంట్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. మంకీ క్యాప్‌లు, మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు బైక్‌పై దుకాణం వద్దకు అర్ధరాత్రి సుమారు 2:30గంటల సమయంలో చేరుకున్నారు. దుకాణం వద్ద ఉన్న ఒక సీసీ కెమెరాను దొంగలు పక్కకు తప్పించారు. అనంతరం దుకాణం గ్రీల్‌తో పాటు షెట్టర్‌కు ఉన్న తాళాలను హ్యాండ్ కట్టర్‌తో కత్తిరించారు. షెట్టర్‌ను హ్యాండ్ కట్టర్‌తో కోసి దొంగలు దుకాణంలోకి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న సుమారు ఆరు కిలోల వెండి వస్తువులతో పాటు తులం బంగారాన్ని అపహరించారు. సుమారు గంటపాటు దొంగలు దుకాణం వద్ద సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. దొంగతనం జరిగిన దుకాణం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. పోలీస్ క్లూస్ టీం సభ్యులు పలు ఆధారాలు సేకరించారు.

హింగులాంబిక ఆలయంలో చోరీ

సుభాష్‌నగర్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హింగులాంబిక ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఆలయ తాళాలు, తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి అమ్మవారి విగ్రహంపై ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. నగలతో పాటు ఆలయంలోని సీసీ ఫుటేజ్ నిల్వ ఉంచే డీవీఆర్‌లను సైతం ఎత్తుకెళ్లారు. ఆలయ పాలక మండలి సభ్యుల ఫిర్యాదు మేరకు 3వ టౌన్ ఎస్సై హరిబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఎడపల్లిలో ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న దృశ్యం

తగ్గిన దిగుబడి.. అప్పుల్లో దిగబడి

▸▸ వానాకాలంలో ధాన్యం దిగుబడులు అంతంతే ▸▸ పెట్టుబడులు రాని పరిస్థితి

▸▸ ఎడపల్లి మండలంలో 1278 ఎకరాల్లో వరి సాగు ▸▸ 90శాతం కోతలు పూర్తి

ఎడపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానలు వరి రైతులను నిండా ముంచాయి. భారీ వర్షాలతో పంట దిగుబడులు అంతంతే వచ్చాయి. వ్యవసాయ బోర్లతో పోలిస్తే ప్రాజెక్టుల నీటికి దిగుబడులు అధికంగా రావాల్సి ఉన్న ఈ ఏడాది మాత్రం అలా జరగలేదు. పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 12748 ఎకరాలలో వరి సాగు చేసిన రైతులకు ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు కూడా దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. ఏటా ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చే వరి ఈ ఏడాది మాత్రం అమాంతంగా పడిపోయి రైతులను నష్టాల్లోకి నెట్టింది.

కొనుగోళ్లు వేగవంతం..

మండలంలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యపు రాశులు ఎక్కడా ఆగడం లేదు. వేగంగానే ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ధాన్యం ఉత్పత్తి భారీగా పడిపోవడంతో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఒక్కో ఎకరాకు పది నుంచి పది హేను బస్తాల దిగుబడులు తగ్గిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా సాగుతుంది.

కౌలు భూములపై రైతుల నిరాసక్తత

గత రెండు మూడేళ్లుగా ప్రాజెక్టులు నిండి పంటలు సాగవుతుండడంతోపాటు అధిక దిగుబడులు వచ్చాయి. మద్దతు ధర లభించడంతో భూముల కౌలు ధరలకు రెక్కలు వచ్చాయి. ఏ ఏడాదికి ఆ ఏడాది రైతులు కౌలు ధరలను పెంచేస్తూ వస్తున్నారు. రైతులు పోటీ పడి కౌలు ధరలను పెంచి భూములను హస్తగతం చేసుకుంటున్నారు. కానీ ఈ ఏడాది వర్షాకాలంలో వరి దిగుబడుల ఉత్పత్తి రైతులను బేజారు చేసింది. రైతులు కౌలు భూముల వైపు కన్నెత్తి చూసే పరిస్థితులు లేవు. కౌలు రైతులు ప్రస్తుత దిగుబడులతో నష్టాల ఊబిలో చేరుకోవడంతో కౌలు భూముల పట్ల నిరాసక్తత ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే ఏడాది కాలం పాటు కౌలు డబ్బులు చెల్లించడంతో గత్యంతరం లేక యసంగిలో పంట వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు అలా చేసేందుకు ముందుకు రావడం లేదు.

బోనస్‌పైనే ఆశలు..



ఈ ఏడాది వర్షాకాలంలో వరి పంట దిగుబడి ఘననీయంగా పడిపోయింది. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల లోపే దిగుబడులు వచ్చాయి. పెరిగిన పెట్టుబడులకు తగ్గిన దిగుబడులకు రైతులకు అప్పులే మిగులనున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌తోనే అప్పుల నుంచి గట్టెక్కే పరిస్థితి.

\- బర్దిపూర్ ప్రవీణ్ కుమార్, రైతు, ఎడపల్లి

అధిక వర్షాలతో దిగుబడులు తగ్గాయి...

వరి పంటలో పూత దశలో అధిక వర్షాలు పడడంతో దిగుబడి తగ్గింది. మండలంలో 12,748 ఎకరాల్లో వరి సాగయిందని, 90 శాతానికి పైగా వరికోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రోజూ కొనుగోళ్లు జరుగుతున్నాయి.

\- సిద్ధి రామేశ్వర్, ఏవో, ఎడపల్లి



బీజేపీలో చేరిన వారితో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

అన్ని మునిసిపాలిటీలు గెలుస్తాం

▸▸ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని మునిసిపాలిటీలను కైవసం చేసుకుంటామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్ మునిసిపల్ పరిధిలోని 8వ వార్డుకు చెందిన పలువురు యువకులు, బీఆర్ఎస్ యువజన నాయకుడు అరుణ్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్మూర్ మునిసిపాలిటీపై బీజేపీ జెండా ఎగురవేస్తామని, బీజేపీది అభివృద్ధి నినాదమని పేర్కొన్నారు. అతి త్వరలో ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు ఉంటాయన్నారు. అనంతరం నియోజకవర్గంలోని బీజేపీ కార్యకర్తలతో సభను ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, పోల్కం వేణు, పెద్దోళ్ల గంగారెడ్డి, జెస్సు అనిల్, కలిగోట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నవనాథ సిద్దులగుట్టపై పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

సిద్ధులగుట్టకు కార్తీక శోభ

పెర్కిట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నవనాథ సిద్దుల గుట్టపై కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో సిద్ధేశ్వరుడికి పంచామృతాలతో, బిల్వ పత్రాలతో అభిషేకాలు చేశారు. మహిళ భక్తులు శివాలయంలో ఉసిరికాయ, నెయ్యి వొత్తులతో దీపాలు వెలిగించారు. అనంతరం ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కుమార శర్మ కార్తీక మాస విశిష్టతను భక్తులకు వివరించారు. నందీశ్వర మహరాజ్ ఆలయంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ అలరించారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులకు ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, బారే వెంకట్‌రమణ, గాదెపల్లి శ్రీదర్, బంటు వీరేందర్ అన్నప్రసాదం అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గుట్టపై సందడివాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, చరణ్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళి, అలిశెట్టి నరేష్, సిద్దుల గుట్ట సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



కోటగిరి ఎంపీడీవోగా నియమితులైన విష్ణు

బాధ్యతల స్వీకరణ

కోటగిరి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కోటగిరి ఎంపీడీవోగా విష్ణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా కేశసముద్రం మండలానికి చెందిన విష్ణును జిల్లాకు కేటాయించారు. కోటగిరి ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాసరెడ్డి ఏడాదిన్నరగా కొనసాగారు. పూర్తిస్థాయి ఎంపీడీవోగా విష్ణు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది, నాయకులు బాధ్యతలు చేపట్టిన విష్ణును ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పోతంగల్ ఎంపీడీవో చందర్, ఎంపీవో క్యాకప్ప, ఏపీవో గంగారాం పాల్గొన్నారు.

మోస్రా ఎంపీడీవోగా సాయికుమార్



ఎంపీడీవో సాయికుమార్

మోస్రా, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా సాయికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగిన శ్రీనివాస్ ఎడపల్లి సూపరింటెండెంట్‌గా వెళ్లారని ఆయన తెలిపారు.

తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జోరా పంచాయతీ పరిధిలోని సిద్దపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు శనివారం ఒక్కొక్కరికి 15 ట్రిప్పుల ఇసుకను తహసీల్దార్ అనుమతితో ఇచ్చామని ఆదివారం ఆణిముత్యాలు బాల్కొండ అనే ఫేస్‌బుక్ ఐడీ ద్వారా అధికారులు ఇసుకను వేరే ప్రాంతానికి తరలిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం పంచాయతీ కార్యదర్శి స్వప్న భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల లబ్దిదారుకు సరిపడా ఇసుకను ఇస్తున్నామని సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీస్‌లు వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఇసుక లబ్ధిదారుల ఇంటి వద్ద అలాగే ఉందని గుర్తించారు. పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్న తన మనోభావాలు దెబ్బతినేలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై తీసుకోవాలని కార్యదర్శి పోలీసులను కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బీర్కూర్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం కిస్టాపూర్ గ్రామానికి చెందిన పోశయ్య (55) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి తన ఇంటికి వెళ్లే క్రమంలో దారితప్పి పీరయ్య అనే వ్యక్తి ఇంటికి వెళ్లాడు. అంతేకాకుండా పీరయ్యతో గొడవ పడ్డాడు. విషయం తెలిసిన పోశయ్య కొడుకు అక్కడికి చేరుకుని తన తండ్రిని ఇంటికి తీసుకెళ్లాడు. సోమవారం ఉదయం పోశయ్య కొడుకు ఏదో పనిమీద బయటకెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పటికే తన తండ్రి మృతి చెందిఉన్నాడు. పీరయ్య కొట్టడం వల్లే తన తండ్రి మృతిచెందాడని ఆరోపించాడు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

రెండు ట్రాక్టర్‌ల పట్టివేత

మోస్రా, అక్టోబరు27, (ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని కారేగాం గ్రామ శివారులోని అటవీ భూమిని ఆదివారం రాత్రి కబ్జా చేసి చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సోమవారం నిజామాబాద్ అటవీ శాఖ కార్యాలయంలో అప్పజెప్పినట్లు వర్ని రేంజ్ అధికారి గంగాధర్ తెలిపారు. పట్టుకున్న వారిలో సెక్షన్ అధికారి జాదవ్, రాజు, బీట్ అధికారి శివకుమార్, హోంగార్డులు నరేందర్ రెడ్డి, చందురెడ్డి ఉన్నారు.

ఆల్ర్పాజోలం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

సుభాష్‌నగర్, అక్టోబర్ 27, (ఆంధ్రజ్యోతి): ఆల్ర్పాజోలం విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు నార్కోటిక్ పోలీసులు దాడిచేసి 500ల గ్రాముల ఆల్ర్పాజోలం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. సోమవారం మోపాల్ మండల పరిధిలోని తాడెం వద్ద నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ పూర్వేశ్వర్ ప్రత్యేక టీం సభ్యులతో దాడులు నిర్వహించారు. వినాయక్‌నగర్‌కు చెందిన సాగర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్‌లు మోపాల్ మండలానికి వెళ్తున్నారన్న సమాచారంతో తాడెం వద్ద పట్టుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.5లక్షల విలువ గల 500ల గ్రాముల ఆల్ర్పాజోలంను పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. విచారం నిమిత్తం మోపాల్ పోలీసులకు అప్పగించారు.



బాల్కొండలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

ముప్కాల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని బాల్కొండ సీఐ శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం బాల్కొండలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పోలీస్, యువజన నాయకుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బాల్కొండ హైస్కూల్ గ్రౌండ్ నుంచి కిసాన్‌నగర్ వరద కెనాల్ వరకు ర్యాలీ సాగింది. శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేనివన్నారు. అనంతరం బాల్కొండ పోలీస్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కిసాన్‌నగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శైలేందర్, లయన్స్‌క్లబ్ సభ్యులు చాకులింగం, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి

సాలూర,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పన్నులు వందశాతం వసూలు చేయాలని తహసీల్దార్ శశిభూషణ్ గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాలూర గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుధ్య లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాలూర డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థలాన్ని గుర్తించాలని కోరారు. అదే విధంగా ఓటర్ లిస్టులో ఉన్న తప్పులను సరిచేయాలని అంగన్‌వాడీలను ఆదేశించారు. 2000 సంవత్సరం నుంచి ఓటర్ లిస్టు జాబితాను ప్రత్యేకంగా పరిశీలన చేసి ఎవరైనా మరణించి ఉంటే ఓటర్ లిస్ట్ నుంచి తొలగించాలని అన్నారు. ఓటర్ లిస్టు జాబితాపై ఒకటికి రెండు సార్లు వివరాలు తెలుసుకుని తప్పులను సవరించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

లక్ష్మాపూర్ పాఠశాలకు డెస్క్‌బెంచీల వితరణ

జక్రాన్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం దాత చిట్టాపూర్ ఏనుగు దయానంద్ రెడ్డి డెస్క్ బెంచీలను వితరణ చేశారు. సుమారు రూ.80వేల విలువచేసే 25 బెంచీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్‌రెడ్డి దాత దయానంద్‌రెడ్డి అందజేశారు.

పిప్రి పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

ఆర్మూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు రూ.45వేల విలువచేసే సౌండ్ సిస్టమ్‌ను సోమవారం అందజేశారు. 2008-2009 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు, ఏడవ తరగతి హాస్టల్ బాలురు సంయుక్తంగా వితరణ చేశారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు నవీన్ విద్యార్థులను అభినందించారు.

రెండు రోజుల పాటు కబడ్డీ టోర్నీ

ఏర్గట్ల, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లరాంపూర్‌లో గ్రామంలో నేటి నుంచి పోలీస్ అమరవీరుల స్మారక ఇన్విటేషన్ కబడ్డీ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. 2 రోజుల పాటు సాగే టోర్నీకి ఆసక్తిగలవారు పేరు నమోదు చేసుకోవాలని, మొదటి బహుమతి రూ.20వేలు, 2వ బహుమతి రూ.10 వేల నగదు అందజేస్తామన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సందర్శన

మెండోర, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, చేపూర్, ఆర్మూర్ విభాగం విద్యార్థులు శ్రీరాంసాగర్ ప్రా జెక్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనకట్ట నిర్మాణవిధానం, నీటి ప్రవాహ నియంత్రణ వ్యవస్థలు, పంపింగ్ స్టేషన్ల కార్యకలాపాలు, విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలను అధ్యయనం చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దేవేందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో నరేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాపూర్‌లో కమ్మర్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా కేంద్రాల నిర్వహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు పాలెపు రాజేశ్వర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన బోధన్ విద్యార్థి

బోధన్, అక్టోబరు27, (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సాయివర్ధన్ అసాధారణ కృషితో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా స్థానికులు, కాలనీవాసులు, పట్టణ ప్రముఖులు సాయివర్ధన్‌ను అభినందించారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. సోమవారం ఇళ్ల లబ్ధిదారుల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు శేఖర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి గంగజమున, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డొంకేశ్వర్, అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపూర్‌లో సీఆర్ఆర్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నాగరాజు, చిన్న భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కళ్యాణీ గ్రామంలో నీటి సరఫరాకు అంతరాయంగా మారిన పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించినట్లు గ్రామపంచాయితీ కార్యదర్శి సుధారాణి తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

ముప్కాల్, జక్రాన్‌పల్లి, మోర్తాడ్ అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బా ల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో పశుసం వర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా 178 పశువులు, ఆవులకు టీకాలను వేశారని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని పశువుల పెంపకం దారులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజుబాయి, గంగుమల్లు, రాజశేఖర్, గోపాల మిత్రలు మల్లేష్, షకీల్, పాడి రైతులు పాల్గొన్నారు.

● జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శిబిరం నిర్వహించారు. 396 పశువులకు, 92 ఆవులకు, దూడలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి అశ్రిత తెలిపారు. గోపాల మిత్రలు రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

● మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్‌లో గాలికుంటు నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. 68 పశువులకు టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్, ప్రభాకర్, ప్రభాస్, తైఫీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుద్రూరు,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామంలో సోమవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 98 ఆవులు, గేదెలకు ఉచిత గాలికుంటు టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాడి రైతులు పశువులకు టీకాలు వేయించాలన్నారు. పశువైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



చిట్టాపూర్‌లో టీకాలు వేస్తున్న దృశ్యం



కొలిప్యాక్‌లో టీకాలు వేస్తున్న డా.అశ్రితరెడ్డి



తిమ్మాపూర్‌లో టీకాలు వేస్తున్న డా.గౌతమ్‌రాజ్

అందని పప్పు.. నిండుకున్న నూనె



భోజనాలు చేస్తున్న చిన్నారులు

- పక్షం రోజులుగా అంగన్‌వాడీల్లో సరుకులు ఖాళీ
- పట్టించుకోని అధికారులు

మద్నూర్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని మద్నూర్ మండల వ్యాప్తంగా చాలావరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్షం రోజులుగా నిత్యవసర సరుకులు నిండుకున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం ఓవైపు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతల కు అందాల్సిన పోషక పదార్థాలు అందకపోవడంతో సంపూర్ణ ఆరోగ్యం ఎలా లభిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది.

మద్నూర్ పరిధిలో ఇలా..

మద్నూర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 208 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సగానికి పైగా అంగన్వాడీ కేంద్రాలలో పప్పులు, నూనె, గత పక్షం రోజులుగా లేకపోవడంతో వారికి నూనె లేని వంటలు, పప్పు లేని భోజనాలు వండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి మద్నూర్ మండలంలోని మేనూర్, లక్షాపూర్, మారేపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఆంధ్రజ్యోతి శనివారం పరిశీలించింది. కాగా ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన పప్పు, నూనెలు నిండుకున్నాయని ఆయా అంగన్వాడీ కేంద్రాలలో వర్కర్స్ చెబుతున్నారు. దీంతో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సరైన పోషక పదార్థాలు అందివ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పక్షం రోజులుగా..

గత పక్షం రోజులుగా అంగన్వాడీ కేంద్రాలలో పప్పు, నూనె, పాలు అందుబాటులో లేని పరిస్థితి. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రాలకు సరుకులు అందజేసే కాంట్రాక్టర్ సకాలంలో సరుకులు అందజేయడం లేదని ఆరోపణలున్నాయి. మండల సూపర్‌వైజర్‌లు, సీడీపీవో సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ప్రభుత్వ నిబం ధనల ప్రకా రం గర్భిణులకు 30 గ్రాముల పప్పు, చిన్నారులకు 15 గ్రాముల పప్పు నిత్యం అందజేయాల్సి ఉంటుంది. అయితే గత 15 రోజులుగా వారికి అవి అందటం లేదని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. మేనూర్ అంగన్‌వాడీ కేంద్రం-2లో జూలై నెలలో 45 కేజీల పప్పు వచ్చినట్లు వర్కర్ ప్రేమల తెలిపారు. మారేపల్లి అం గన్వాడీ కేంద్రంలో ఆగస్టు నెలలో 5కిలోల పప్పు వచ్చినట్లు వర్కర్ సుజాత తెలిపారు. లక్ష్మాపూర్ మినీ అంగన్వాడీ కేంద్రంలో ఆగస్టులో 15 కిలోల పప్పు వచ్చినట్లు వర్కర్ లలిత తెలిపారు. అదేవిధంగా మల్లాపూర్ అంగన్వాడీ కేంద్రంలో నూనె, పప్పులు లేవని గత వారం రోజులుగా చిన్నారులకు ఆకుకూ రలు వండి పెడుతున్నామని వర్కర్ మీరాబాయి తెలి పారు. ఈ అంశంపై మద్నూర్ ప్రాజెక్టు సీడీపీవో కళావతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సరుకుల పంపిణీ చేసే టెండర్ ఆలస్యం చేయడంతో సకాలం లో సరుకులు అందలేదని, నేటి నుంచి ప్రాజెక్టు పరిధి లోని ఆయా అంగన్వాడీ కేంద్రాలకు పప్పులు వేయాల ని ఆదేశాలు జారీచేశామన్నారు. ఇప్పటికే కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పప్పులు అందుతున్నాయని వివరించారు.



చేతులు శుభ్రం చేసుకుంటున్న చిన్నారులు

జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో దత్తుకు చోటు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామానికి చెందిన కొమ్మ దత్తుకు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. సామాజిక సేవా దృక్పథంతో పాటు వివిధ రంగాల్లో ప్రావీణ్యం, ప్రాచీన కళాపోషణ, ఆధ్యాత్మికత తదితర రంగాల్లో ఆయన నైపుణ్యతకు గాను ఈ ఘనత సొంతమైంది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని భారత విద్యాభవన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ వారు ప్రదానం చేసిన ప్రైడ్ ఆఫ్ నేషన్ టాలెంట్ అవార్డు -2025లో భాగంగా ఈ అవార్డు దక్కిందని ఆయన తెలిపారు. ఈ మేరకు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న కొమ్మ దత్తు



మంత్రి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న అభినవ్

ఎల్లారెడ్డి వాసికి గ్రూప్-1 ఉద్యోగం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణీ గ్రామానికి చెందిన అభినవ్ చందర్ గ్రూప్-1 ఉద్యోగం సాధించారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్ మండల ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారని అన్నారు. గ్రూప్-1 ఉద్యోగం సాధించి గ్రామానికి ఖ్యాతి తెచ్చిన అతడిని గ్రామానికి చెందిన ఎన్‌యూజేఐ ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్, రిటైర్డ్ రెవెన్యూ అధికారి హరిప్రసాద్, ఎన్ఆర్ఐ రాజ్‌కుమార్, పలువులు గ్రామస్థులు అభినందించారు.

తడిసిన ధాన్యం పరిశీలన



ధాన్యం పరిశీలిస్తున్న రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి

బాన్సువాడ రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సోమవారం రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, మొగులయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం షురూ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రజిత

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ రజిత సోమవారం ప్రారంభించినట్లు ఏపీఎం రాంనారాయణగౌడ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ప్రతి రైతు వరుస క్రమంలో ధాన్యం తూకం అయిన వెంటనే రైతుల వివరాలు సెంటర్ ఇంచార్జికి అందజేయాలని సూచించారు. రైతులు ఇచ్చిన వివరాలను ట్యాబ్‌లో ఎంటర్ చేయడం జరుగుతుందని వివరించారు. వివరాలు సక్ర మంగా ఇచ్చిన రైతులకు 48గంటల్లో వారి ఖా తాల్లో డబ్బులు జమ కావడం జరుగుతుం దన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మహిళా సంఘాల సభ్యులు కొనుగోలు ప్రక్రియ చేపడతారని చెప్పారు. ఈ కార్యక్ర మంలో మహిళా సంఘం అధ్యక్షురాలు యమున, సీసీ రమేష్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గంగారెడ్డి, శంకరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నదాతలు మోసపోవద్దు

మెండోర, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు పండించిన వరి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, దళారుల చేతిలో మోసపోవద్దని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల వద్ద నుంచి చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని అన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు.

సన్నవడ్లకు బోనస్ ఎప్పుడు?

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): గత యాసంగిలో సన్నరకం వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఈ సారైనా ఎప్పుడిస్తారో చెప్పాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లింగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. వరి కోతలు ఊపందుకున్నాయని అకాలవర్షాల వల్ల రైతులకు ఊపిరి ఆడకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం బోనస్‌పై వెంటనే స్పష్టత ఇవ్వాలని అన్నారు.

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

బాన్సువాడటౌన్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు బాన్సువాడ డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఎస్ఎస్‌సీ- 2026కి సంబంధించి నామినల్ రోల్స్‌పై ముఖ్య సూచనలు, సలహాలు ఇవ్వనున్నామన్నారు. డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

కార్తీక దీపాలు.. శుభ సంకేతాలు



శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పిట్లం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస సోమవారాను పురస్కరించుకొని మండలంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు శ్రీరాజరాజేశ్వరాలయంలో, శ్రీ రామలింగేశ్వర ఆలయాలకు పెద్దఎత్తున చేరుకొని అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయంత్రం వేళలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసం శివాలయంలో దీపాలు వెలిగిస్తే అంతా మంచి జరుగుతుందని ఆలయ పూజారి బసవరాజ్ తెలిపారు.

పరీక్షలు వాయిదా వేయాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఇందల్వాయి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఫార్మా కెమిస్ట్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ నాయకులు సోమవారం రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్‌చారి మాట్లాడుతూ.. ఫార్మాకెమిస్ట్రీ సెమిస్టర్ పరీక్షల సిలబస్ ఇంకా పూర్తికాలేదని ప్రిపరేషన్‌కు సమయం ఇచ్చి పరీక్షలను వాయిదా వేసి తేదీని పొడగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, పృథ్వి, సమీర్, అశోక్, అనిల్, విజయ్, శివపన్, కళ్యాణ్, అభిషేక్ తదితరులు ఉన్నారు.

30న ఉమ్మడి జిల్లా జూడో ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూడో ఎంపికలను ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని డీఎస్ఏ మైదానంలో అండర్-17 బాలబాలికల జూడో ఎంపికలను నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం వ్యాయామ ఉపాధ్యాయురాలు అనిత 7893973128 నంబర్‌ను సంప్రదిం చాలని కోరారు.

నవంబర్ 3న రగ్బీ ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల అండర్- 17 రగ్బీ బాల బాలికల ఎంపికలు నవంబర్ 3న నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరి హీరాలాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ఎంపికలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్‌లను వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు నవంబర్ 7, 8, 9వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఓటరు జాబితాలో తప్పులను సవరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాధర్

కోటగిరి, అక్టోబరు27, (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులను సవరించాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 2002 నుంచి 2025 ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి చనిపోయిన వారిని తొలగించాలన్నారు. ఒక కుటుంబాన్ని ఒకే వార్డులో వచ్చేలా ఓటరు జాబితాను సవరించాలని సూచించారు.



ఎంఈవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని, పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడం బాధాకరమని, వెంటనే చెల్లించాలని ఎల్లారెడ్డి మండల మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు హేమలత అన్నారు. సోమవారం పట్టణకేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో రాజులుకు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఈ నెల 31వ తేదీన కలెక్టర్ ఆఫీసు ఎదుట ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 12వ తేదీన చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని చేపటడతాన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సంగీత, రాములు, పాయిలు, సంగే నాయక్ పాల్గొన్నారు.

నర్సరీలు కాపాడుకోవాలి

ఆలూర్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్దపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా 2026-2027 ఆర్థిక సంవత్సరానికి ప్లానింగ్ ప్రాసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలూర్ ఎంపీడీవో గంగాధర్ హాజరై మాట్లాడారు. ఉపాధిహామి పథకాన్ని క్రమశిక్షణతో నిర్వహించాలని, ప్రతీ విషయాన్ని ఎప్పటికప్పుడు ఎంపీడీవో ఆఫీస్‌కు నివేదిక ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. నర్సరీలను కాపాడుకోవాలని, లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఆర్మూర్ ఏపీవో సురేష్, పంచాయితీ కార్యదర్శి నవీన్, స్పెషల్ ఆఫీసర్ నితీష్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ విద్యార్థుల ర్యాలీ

ఆర్మూర్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న హాస్టల్ విద్యార్థుల బిల్లులను, స్కాలర్‌షిప్ రియింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్మూర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు విద్యార్థులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థినులకు నెలవారీ రూ.500 మెయింటెనెన్స్ ఫండ్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు నికిల్, రుచిత, వివేక్, వినయ్, రాజేష్, రోహిత్, స్వాతి, త్రిష, అఖిల, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో భక్తుల రద్దీ

బాన్సువాడ రూరల్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో సోమవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం దేవి ఉపాసకులు మహేష్ భార్గవ్ అర్చకత్వంలో ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లి ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంబాన్ని ప్రతిష్ఠించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, యజ్ఞ యాగాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌడకులస్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేత్రదానం గొప్ప విషయం

బోధన్, అక్టోబరు27, (ఆంధ్రజ్యోతి): నేత్రదానం మరొకరికి చూపునందిస్తుందని, మరణానంతరం నేత్రాలను దానం చేయడం చాలా గొప్ప విషయమని బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి ప్రతినిధి బసవేశ్వర్ రావు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన వేములపల్లి ఫణికళ్యాణ్(38) మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు కళ్యాణ్ నేత్రాలను లయన్స్ కంటి ఆసుపత్రికి అందించారన్నారు. ఇలా మరణానంతరం నేత్రాలను దానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించినట్లు అవుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి మరొకరికి చూపును అందిస్తామన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

విద్యావ్యవస్థ పటిష్ఠతకు ప్రత్యేక శ్రద్ధ

కమ్మర్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థను మరింత ప్రతిష్ఠ పర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు మంజూరైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పాఠశాలలో అభివృద్ధి పనుల నిమిత్తం సీడీపీ నిధుల నుంచి రూ.15 లక్షలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, గ్రామశాఖ అధ్యక్షుడు సల్లూరి గణేష్ గౌడ్, బుచ్చిమల్లయ్య, వేముల గంగారెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ, దూలురి కిషన్ గౌడ్, పాలెపు రాజేశ్వర్, కోనగిరి లక్ష్మణ్, శైలేందర్, నాగరాజు, జగదీష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అటు గుంత.. ఇటు పార్కింగ్

బాన్సువాడటౌన్, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రయాణమే ఓ ప్రయాసగా మారింది. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులు బ్యాంక్ ఎదుటే వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. దాదాపు రహదారి సగం వరకు పార్కింగ్ చేసిన వాహనాలే దర్శనమిస్తుంటాయి. దీనికి తోడు బ్యాంక్‌కు ఎదురుగానే వర్షపు నీరు, మురికినీటిని మళ్లించడానికి అధికారులు అదే దారిపై గుంత తవ్వారు. ఆ గుంత వైపుకు వెళ్లకుండా టైర్లను ఏర్పాటుచేశారు. దీంతో రహదారి ఇరుగ్గా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వాహనదారులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాన్సువాడ ప్రధాన రహదారిపై రద్దీ ఇలా

నిధులు మంజూరు చేయాలని వినతి

నందిపేట, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఉమ్మడి నందిపేట మండల మున్నూరు కాపు కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం నిజామాబాద్ పర్యటనలో ఉన్న రాజ్యసభ సభ్యుడు కేతిరెడ్డి సురేష్ రెడ్డికి సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. మండపంలో కిచెన్ షెడ్డు నిర్మించడానికి రూ.కోటి, వాటర్‌ట్యాంకు నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనికి రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పినట్లు మున్నూరు కాపు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామా బాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సిలిండర్ లింగం, అయిలాపూర్ సొసైటీ మాజీచైర్మన్ సిద్దాపురం లక్ష్మీనారాయణ, నాయకులు జగత్ రెడ్డి, దారం సురేష్, ఏర్రం ముత్యం, కొత్తూర్ భరత్ తదితరులు ఉన్నారు.



ఎంపీ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్నూరుకాపు సంఘ ప్రతినిధులు

మొక్కలపై జీనోమ్ సీక్వెన్సింగ్ పరిశోధనలు

ఇందల్వాయి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో పెరుగుతున్న జనాభాకు సరిపడా వ్యాధి రహిత పంట మొక్కలను ఉత్పత్తి చేయడానికి జీనోమ్ సీక్వెన్సింగ్ పరిశోధనలు ఉపయోగపడతాయని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఇర్ఫాన్ అహ్మద్ ఖాజీ తెలిపారు. సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగజ ఆధ్వర్యంలో ఒక జీవి పూర్తి జీనోమ్ సీక్వెన్సింగ్ క్లాసికల్ పద్ధతులు అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఇర్ఫాన్ హాజరై మాట్లాడుతూ.. వరి జీనోమ్ పూర్తిగా సీక్వెన్సింగ్ చేయబడిన మోడల్ క్రాప్‌గా ఉపయోగపడుతుందని వివరించారు. 1997-2000 సంవత్సరంలో అంతర్జాతీయ వారి జీనోమ్ సీక్వెన్సింగ్ ప్రాజెక్ట్ ప్రారంభమై 2002లో పూర్తి అయిందన్నారు. ఇది ఇతర పంటలయిన గోధుమ, మొక్కజొన్న వంటి వంగడాల అధ్యయనానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సీక్వెన్సీ కోసం సాంగర్ సిక్వెన్సింగ్ వర్క్ ఆధారిత క్లోన్ పద్ధతులను ఉపయోగించి నూతన పంటలు పెరుగుదల, అధిక దిగుబడి, వ్యాధి నిరోధకత, నీటి ఒత్తిడికి జీనోమ్ అధ్యయనాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తెయూ వృక్షశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హలీం ఖాన్, ఆచార్య ఎం.అరుణ. ఆచార్య పి.విద్యావర్ధిని, డాక్టర్ శ్రీనివాస్, ఆర్మూర్ నరేంద్ర కళాశాల, జీజీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పసుపుపై తెగుళ్ల పంజా

(5వ పేజీ తరువాయి)

ఏర్పడి తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పసుపు పంటలో ఎదుగుదల లోపించి లోపలి భాగంలో పసుపు కొమ్ము ఏర్పడక తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపు పంటలు నీరు నిలిచిపోవడంతో దుంప కుళ్లిపోయే ప్రమాదం అధికంగా ఉంటుందని దిగుబడి సగానికి పడిపోయే అవకాశం ఉంటుందని రైతులు నిరాశ చెందుతున్నారు. వర్షాలతో నష్టపోయిన పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

» జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ » ప్రజావాణికి 104 ఫిర్యాదులు » జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన అర్జీదారులు

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు తమ అర్జీలను అధికారులకు అందించి తమ సమస్యలను విన్నవించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనాలి..

వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నగర కన్వీనర్ కటారి రాములు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు భరోసా కల్పించాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు ప్రత్యేక గోదాంలను, తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రఫీయుద్దిన్, సయ్యద్‌కాలేం, గోపాల్‌సింగ్ ఠాకూర్, శివ తదితరులు పాల్గొన్నారు.

పట్టాపాస్‌బుక్‌లో మిగతా భూమిని చేర్చాలి..

మోపాల్ శివారులోని సర్వే నెంబర్ 398లో 2ఎకరాల 12గుంటల భూమి ఉండగా కేవలం 32గుంటలు మాత్రమే పట్టాలో ఎక్కించారని, మిగతా భూమిని కూడా చేర్చలేర్చాలని ప్రజావాణిలో ఠాణాకుర్దుకు చెందిన నడ్పి సాయన్న ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. భూమి తన ఆధీనంలో ఉందని, సమగ్ర విచారణ చేసి భూమిని తన పాస్‌బుక్కులో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టవర్ ఏర్పాటును ఆపివేయాలి..

నగరంలోని ఏకశిలనగర్ కాలనీలో ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఏర్పడతాయని టవర్ ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని కాలనీవాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీ మొత్తం పూర్తిగా నివాస ప్రాంతమని, పాఠశాలలు, దేవాలయాలు ఉన్నాయని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సెల్‌టవర్ ఏర్పాటు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజల అనుమతి లేకుండా టవర్ పెడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఏర్పాటు ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.

పెన్షన్ ఇప్పించాలి

బస్సు ప్రమాదంలో తన కాలు పూర్తిగా పోయిందని.. పెన్షన్ ఇప్పించాలని ముదక్‌పల్లికి చెందిన నరేష్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నగర బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు తన కాలుపై వెళ్లడంతో విరిగి పోయిందన్నారు. అప్పటినుంచి ఇబ్బందులు పడుతున్నానని, అధికారులు పెన్షన్ ఇప్పించాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, చిత్రంలో సీపీ

ఖైదీల్లో మార్పు రావాలి

» జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా

మోపాల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జైలు జీవితాన్ని అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు వచ్చినపుడు వారి కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా అన్నారు. సోమవారం సారంగపూర్ జిల్లా జైలును ఆమె సందర్శించారు. అనంతరం జైలులో ఉన్న ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలిసో తెలియకనో తప్పు చేసి జైలు జీవితాన్ని అనుభవిస్తున్న వారందరిలో మార్పు రావాలన్నారు. మీరు జైలులో ఉండడం వల్ల మీ కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోంటున్నాయని ఆలోచించాలన్నారు. ఇకనైన మార్పు వస్తే జీవితాల్లో వెలుగులు వెలుగుతాయన్నారు. జైలులో ఏర్పాటు చేసిన 3వ తేనేటీగల కేంద్రాన్ని ప్రారంభించారు. ఖైదీలకు తేనేటీగల పెంపకంపైన శిక్షణ ఇవ్వడంతో పాటు స్వీయ ఉపాధి అవకాశాలను కల్పించడమే పోలీసు శాఖ లక్ష్యమన్నారు. తేనేటీగల పెంపకం సహజ సిద్ధమైన ప్రశాతంతతనిచ్చే కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో సీపీ సాయి చైతన్య, జైల్ సూపరింటెండెంట్ దశరథ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కోసమే పునరావాస ఉపాధి కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పర్సన్ వరంగల్ రేంజ్ అధికారి సంపత్, సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా రఘునాథ ఆలయ దర్శనం

నిజామాబాద్ ఖిల్లా రఘునాథుణ్ని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా దర్శించుకున్నారు. సీతారామ చంద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలను తిలకించి ఆలయ చరిత్రను ట్రస్ట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సౌమ్య మిశ్రకు కూర్మ పీఠంపై ఉన్న సీతారామచంద్రస్వామి జ్ఞాపికను అందజేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న బోస్టల్ స్కూల్‌ను ఆలయ ట్రస్ట్‌కు అప్పగించాలని ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు కందాళై నర్సింహామూర్తి, ఆలయ అర్చకులు సందీప్, జైలర్ ఉపేంద్ర, ట్రస్ట్ సభ్యులు పెండ్యాల శ్రీనివాస్, మాజీ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్, అంబదాస్‌రావు, ప్రకాష్, శంకర్, నాగనాథ్, వీరేశం, ఆలయ ఇంచార్జి పోశెట్టి పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

» రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా రవి, తిరుపతి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా తాటికొండ రవి, మాదం తిరుపతిలను ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలో గత మూడు రోజుల నుంచి రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. సోమవారం చివరి రోజున రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 45 మందితో రాష్ట్ర కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. 14 తీర్మానాలను ఆమోదించామని నూతన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. విద్యా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



సమావేశమైన యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పది మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

సుభాష్‌నగర్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న 10 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లబించింది. పదోన్నతి లబించిన హెడ్‌కానిస్టేబుల్స్ సీపీ సాయిచైతన్యను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన వారిలో లింబాద్రి, చిన్నయ్య, గణేష్, యాదవ్, వరప్రసాద్, హరిఫ్ ఉద్దిన్, శేఖర్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, రామ్‌చందర్ ఉన్నారు.



పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లతో సీపీ సాయిచైతన్య

పోలీసు ప్రజావాణికి 11 ఫిర్యాదులు

సుభాష్‌నగర్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సీపీ సాయిచైతన్య సూచించారు. జిల్లాకేంద్రంలోని కమిషనరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 11 ఫిర్యాదులుఅందాయి. చట్టప్రకారం అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని సీపీ ఆదేశించారు.

విద్యావ్యవస్థ లేనిదే భవిష్యత్తు లేదు

» రూ.కోటి విరాళం ప్రకటించిన బిగాల సోదరులకు అభినందనలు
» ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

హర్షణీయమన్నారు. విద్యాధికారులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని ఆయన కోరారు. బిగాల సోదరుల పూర్వీకులు చేసుకున్న పుణ్యానికి నేడు వారు ఆర్థికంగా బలపడడంతో పాటు సామాజిక సేవకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థుల బోధన కోసం కార్పొరేట్ స్థాయిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో పది గదులు, మొదటి అంతస్తులో మరో పది గదులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బందికి ఐదు గదులు, రెండు సైన్స్ ల్యాబ్‌లతో పాటు ఒక కంప్యూటర్ గదిని, డైనింగ్ కిచెన్, టాయిలెట్స్, గార్డెన్ సౌకర్యాలు కల్పించారని ప్రస్తుతం 389 విద్యార్థులుండగా వాటి సంఖ్యను రెట్టింపు చేయాలని ఆయన విద్యా సిబ్బందిని కోరారు. ఉన్నత పాఠశాలకు మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్, తండ్రి బిగాల క్రిష్ణమూర్తి పేరును, ప్రాథమిక పాఠశాలకు ఆయన తాత బిగాల గంగారాం పేరు పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్, బిగాల మహేష్, అడిషనల్ కలెక్టర్ కిరణ్, డీఈవో అశోక్, ఎంఈవో సత్యానారాయణతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠేశ్వర ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



నీలకంఠేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శంభోశంకర హర హర మహాదేవ... భక్తుల నామస్మరణలతో శివాలయాలు మారుమోగాయి. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో భక్తులు శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. శివలింగానికి వేద పండితులు రుద్ర నమక చమకముతో పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష బిల్వార్చన పూజలు జరిపారు. పలు ఆలయాల్లో ఉదయం ప్రారంభమైన అభిషేకాలు రాత్రివరకు సాగాయి. సాయంత్రం ఆలయాల్లో శివలింగానికి ప్రదోశకాల పూజలు నిర్వహించి ఆకాశ దీపం వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు వివిధ ఆకారాల్లో దీపెంతలతో కార్తీక దీపాలను వెలిగించి పూజించారు. జిల్లా కేంద్రంలోని శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయంలో అర్చకులు సుహాస్ శాఖాయ్, మకరంద్ శాఖాయ్‌లు శివుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో ఆకాశ దీపానికి వెలిగించగానే భక్తులు ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతుల్లో ఉన్న కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరుకు అర్చకులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి భక్తులతో కలిసి కోనేరు హారతి ఇచ్చారు. అదేవిదంగా నగంలోని శంభులింగేశ్వరాలయం, ఉమామహేశ్వర ఆలయం, భీమేశ్వర ఆలయం, అమరేశ్వర ఆలయం, ఓంకారేశ్వర ఆలయం, మనోకామేశ్వర ఆలయం, బాల హనుమాన్ ఆలయం, మార్కండేయ ఆలయం, తదితర ఆలయాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు సాగాయి. ఇందూరు శంభులింగేశ్వర ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు.



నీలకంఠేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



శంభులింగేశ్వర ఆలయంలో..

లక్కీ 'డ్రా'ప్..

అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలకు లక్కీ డ్రాలో మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. నవీపెట్‌కు చేందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌కు తన భార్య ఉమ పేరు మీద రెండు దుకాణాలు దక్కాయి. నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత శరత్‌కు అదృష్టం కలిసివచ్చింది. బీఆర్ఎస్ సీనియర్ నేత నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ద్వారకానగర్ షాపును దక్కించుకున్నారు. ఈసారి నేతలకు లిక్కర్ లక్కీ డ్రా కలిసి వచ్చింది.

పక్కాగా ఏర్పాట్లు

నూతన ఆబ్కారీ విధానాన్ని అనుసరించి ఎలాంటి లోటుపాట్లకు తావులే కుండా ఏర్పాట్లు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్‌లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. అనుమానా లకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుంచి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. టోకెన్ కలిగి ఉన్న వారినే డ్రా ప్రాంగణంలోకి అనుమతించారు. పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోలీసు బందోబస్తును పర్య వేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రా విజేతలు లైసెన్స్ ఫీజు చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది.

అయ్యయ్యో... డబ్బులు పోయెనే...

ప్రస్తుత మద్యం దుకాణాల కేటాయింపులో కొందరు సిండికేట్‌లకు ఖేదం మిగిల్చగా... మరికొందరికి సంతోషాన్ని ఇచ్చింది. ఓ మండల కేంద్రానికి చెందిన సిండికేట్ వ్యాపారులు 31దరఖాస్తులు చేయగా వారికి ఒకే ఒక మద్యం దుకాణం వచ్చింది. మరో32 మంది సిండికేట్ గా దరఖాస్తు చేయగా కేవలం ఒకటి మాత్రమే దక్కింది. ఇతర సిండికేట్ వ్యాపారులకు 14దరఖాస్తులు చేయగా 2మద్యం దుకాణాలు వచ్చాయి. కొత్తగా సిండికేట్‌గా మారి రెండు మూడు దరఖాస్తులు చేసిన వారికి అదృష్టం వరించలేదు. అనవసరంగా డబ్బులు పోగొట్టుకున్నామనే బాధతో వెనుతిరిగారు. ఇదిలాఉంటే సిండికేట్ వ్యాపారులు మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ప్రయత్నాలుమొదలు పెట్టారు.

2వసారి ఏర్గట్ల దుకాణం శ్రీధర్‌రెడ్డిదే..

జిల్లాలో అత్యధికంగా ఏర్గట్ల మద్యం దుకాణానికి దరఖాస్తులు 96 రాగా, ఈ మద్యం దుకాణాన్ని లక్కీ డ్రాలో అంక్సాపూర్‌కు చెందిన శ్రీధర్ రెడ్డి దక్కించుకున్నారు. గత టెండర్లలో ఏర్గట్ల మద్యం దుకాణానికి 110దరఖాస్తులు రాగా అప్పుడు లక్కీ డ్రాలో శ్రీధర్ రెడ్డికి ఈ దుకాణం వరించింది. జిల్లాలో ప్రస్తుతం అత్యధికంగా దరఖాస్తులు నమోదైన ఏర్గట్ల మద్యం దుకాణం ఎవరికి దక్కుతుందోనని ఆసక్తిగా ఎదురుచూడగా రెండోసారి శ్రీధర్ రెడ్డికి దుకాణం దక్కింది. ప్రస్తుత టెండర్‌లో సైతం శ్రీధర్ రెడ్డికి లక్ వరించడంతో తన సంతోషానికి అవదులు లేకుండా పోయింది. జిల్లాలో అత్యధికంగా టెండర్లు దాఖలయ్యే ఈ మద్యం దుకాణానికి రెండుసార్లు శ్రీధర్‌కు రావడం పట్ల ఆయన నక్క తోకని తొక్కాడని సర్వత్రా చర్చనీయాంశమైంది.

నగరం మరింత భద్రం..

(5వ పేజీ తరువాయి)

కెమెరాల విస్తరణ వంటి చర్యలు తీసుకుంటారు. "మహిళ భద్రంగా ఉంటే నగరం సంతోషంగా ఉంటుంది" అనే నినాదంతో కౌన్సెల్ ముందుకు సాగనుంది. భద్రత పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతా భావం పెంచడమే ప్రధాన లక్ష్యం. పోలీసు అధికారులు స్వయంగా ఈ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

పరిశ్రమల నుంచి విద్యాసంస్థల వరకు..

భద్రతా మండలి పరిధి కేవలం పోలీస్ పరిధిలోనే కాకుండా ప్రతిరంగానికీ విస్తరించనుంది. విద్యాసంస్థలు, పరిశ్రమలు, గృహ సముదాయాలు, ఆస్పత్రులు ఇందులో భాగమవుతాయి. ప్రతి విభాగం నుంచి ఒక ప్రతినిధిని ఎంపిక చేసి కౌన్సెల్‌లో చేరుస్తారు. అగ్నిమాపక, ఆరోగ్యశాఖతో సమన్వయంతోసేవలు బలోపేతం చేస్తారు.

ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా చేపట్టాలి

» రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో ధాన్యం, పత్తి కొనుగోలు, అకాల వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా తగీన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. తుపాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుపాను తీవ్రత తగ్గే వరకు వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయని, సోయాబీన్ రైతుల సౌకర్యార్థం కూడా జిల్లాలో మంగళవారం 12 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వినయ్‌కృష్ణా రెడ్డి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో వరంగల్, కరీంనగర్ రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు రోడ్లపైకి వస్తుంటే పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విద్యార్థిలోకాన్ని చైతన్యపరచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించడానికి కంకణం కట్టుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వంజరి బాలకృష్ణ, గోపి, దుర్గాదాస్, సన్ని, సిద్ధు, విగ్నేష్‌టోని, కార్తిక్, హరీష్ తదితరులున్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నేతలు

త్రిమూర్తి ఫర్నీచర్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ షోరూం త్రిమూర్తి ఫర్నీచర్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల త్రిమూర్తి షోరూంలో సంస్థాపకులు కొండ వీరేశం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1975లో ఆజాంరోడ్‌లో మొదటి దుకాణాన్ని ప్రారంభించిన.. అనంతరం దేవిరోడ్‌లో దుకాణం కార్యకాలాపాలు నిర్వహించామన్నారు. 2009లో వినాయక్‌నగర్‌లో ఫర్నీచర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా అతిపెద్దషోరూం నిర్మించి కార్యకలాపాలు మొదలుపెట్టామని తెలిపారు. ఇప్పటికి 50 సంవత్సరాలు గడుస్తున్నా వినియోగదారుల మన్ననలు పొంది జిల్లాలోని అగ్రగామిగా ఉన్నామన్నారు. అనంతరం త్రిమూర్తి షోరూం యాజమానులు శ్రావన్, పవన్‌లు మాట్లాడుతూ.. ఇంతటి అభివృద్ధికి కారకులైన వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. తక్కువ ధరలో ఎక్కువ నాణ్యత గల ఫర్నిచర్‌ను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముకులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న యాజమాన్యం

సినిమా గైడ్

దేవి	: బైసన్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: కె-ర్యాంప్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: డ్యూడ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కె-ర్యాంప్ (11.00, 4.40, 7.30, 10.20)
	:బైసన్ (తెలుగు) (1.35)
స్క్రీన్-2	: డ్యూడ్ (1.30,7.30)
	: తెలుసు కదా (4.30)
	:బైసన్ (తెలుగు) (10.20)
స్క్రీన్-3	:బైసన్ (తెలుగు) (11.00,4.30)
	:తమ్మ(1.50,7.30)
	:ఎక్ దివానికి దివానియత్:(హిందీ) (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: డ్యూడ్ (11.00, 2.05, 5.00, 7.55, 10.50)
స్క్రీన్-2	: కాంతారా చాప్టర్-1 (10.20)
	: కె-ర్యాంప్ (1.45, 7.35, 10.30)
	: మిత్రమండలి (4.40)
స్క్రీన్-3	: తెలుసు కదా (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-4	: కె-ర్యాంప్ (10.20)
	: మిత్రమండలి (1.15, 7.35)
	: కాంతారా చాప్టర్-1 (4.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,24,000	రూ.1,14,200	రూ.1560

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.260	రూ. 280

